

### వేస్ట్ టు ఆర్ట్ ఎగ్జిబిషన్

మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన వేస్ట్ టు ఆర్ట్ ఎగ్జిబిషన్ విశేషంగా ఆకట్టుకుంది.

వివరాలు 10లో ▸



### జూరాలకు పెరిగిన ఇన్‌ఫ్లో

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో కాస్త పెరిగింది.

వివరాలు 10లో ▸

### వాతావరణం

గరిష్టం/కనిష్టం
37.8 /21.7

ఎండ తీవ్రంగా ఉంటుంది. ఆకాశం అప్పుడప్పుడు మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం జల్లులు పడే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### కల్వకుర్తి మున్సిపాలిటీకి స్వచ్ఛదివాస్ అవార్డు



**కల్వకుర్తి టౌన్:** పట్టణాల **స్వచ్ఛతపై అందించే** స్వచ్ఛ దివాస్– 2024 అవార్డుకు కల్వకుర్తి మున్సిపాలిటీ ఎంపికై ంది. స్వచ్ఛతా హీ సేవలో భాగంగా మున్సిపాలిటీలో నిర్వహిస్తున్న పలు అంశాల్లో ఉత్తమ ప్రతిభకనబర్చినందుకు గాను కల్వకుర్తి మున్సిపాలిటీ స్వచ్ఛ భారత్ దివాస్–2024కు ఎంపికైందని మున్సిపల్ కమిషనర్ మహమూద్ షేక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీలో సేకరిస్తున్న చెత్తను డీఆర్‌సీసీ ద్వారా స్వయం సహాయక మహిళా సంఘాలు నిర్వహిస్తున్న విధానంతోపాటు, పట్టణ పరిశుభ్రత విభాగంలో ప్రశంసాపత్రాన్ని అందుకుంటుంది. గాంధీ జయంతి సందర్భంగా బుధవారం న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో నిర్వహించే కార్యక్రమంలో ప్రశంసను మున్సిపాలిటీ అందుకోనుంది. రాష్ట్రంలోని నాలుగు మున్సిపాలిటీలు ఈ అవార్డుకు ఎంపికవగా.. అందులో కల్వకుర్తి ఉండటం విశేషం. స్వచ్ఛ దివాస్ అవార్డు సాధించడంలో కృషిచేసిన ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ శివ, ఎస్‌హెచ్‌జీ సంఘాలను కమిషనర్ అభినందించారు.

### కాంట్రాక్టు పద్ధతిన వైద్య పోస్టుల భర్తీ

**నాగర్‌కర్నూల్ క్రైం:** తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న స్పెషలిస్టు వైద్యులు, సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులను కాంట్రాక్టు పద్ధతిన భర్తీ చేసినట్లు జిల్లా ప్రధాన ఆస్పత్రి సూపరింటెండెంట్ రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 4న జిల్లాకేంద్రంలోని ప్రధాన ఆస్పత్రి కార్యాలయంలో అందజేస్తే ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేస్తామన్నారు. అర్హత కలిగిన వైద్యులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

### సదరం శిబిరాలను వినియోగించుకోండి

**నాగర్‌కర్నూల్ క్రైం:** జనరల్ ఆస్పత్రిలో ఈ నెల 8 నుంచి 29 వరకు నిర్వహించే సదరం శిబిరాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఓ చిన్న ఓబులేషు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం లోగా అర్హులైన వారు సదరం క్యాంపు సర్టిఫికెట్ కోసం మీసేవా కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకుని.. ఆయా తేదీల ప్రకారం హాజరుకావాలన్నారు. ఈ నెల 8, 15, 22, 29 తేదీల్లో శారీరక వికలాంగులకు, 16, 23 తేదీల్లో వినికిడి లోపం వారికి, 7, 23 తేదీల్లో కంటిచూపు లోపం వారికి, 16, 23 తేదీల్లో మానసిక వికలాంగులకు ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు చెప్పారు. శిబిరాలకు వచ్చేవారు మెడికల్ రిపోర్టులతోపాటు ఆధార్‌కార్డు జిరాక్స్ తీసుకురావాలని సూచించారు.

### నేడు డయల్ యువర్ ఏటీఎం

**స్టేషన్ మహబూబ్‌నగర్:** డయల్ యువర్ ఏటీఎం (టీజీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్) కార్యక్రమాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు ఇసాక్ బిన్ మహ్మద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని ప్రజలు, కార్గో వినియోగదారులు ఉదయం 11 నుంచి 12 గంటల వరకు పార్సిల్, కార్గో విషయాలపై 81254 56978 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు.

# సీసీఐపైనే ఆశలు

## ఇప్పటికే మొదలైన పత్తి దిగుబడి రాక



నాగర్‌కర్నూల్ జిల్లా తాండ్ర సమీపంలోని ఓ కాటన్‌మిల్లులో పత్తిని అన్‌లోడ్ చేస్తున్న రైతులు (ఫైల్)

- బహిరంగ మార్కెట్‌లో దక్కని మద్దతు ధర
- ప్రభుత్వ కేంద్రాలపైనే ఆశలు పెట్టుకున్న రైతాంగం
- కొనుగోలు కేంద్రాలకు టెండర్లు పూర్తిచేసిన అధికారులు

**కల్వకుర్తి:** ఇప్పుడిప్పుడే పత్తి దిగుబడులు రాక మొదలయ్యాయి. వర్షాలు కురుస్తుండటంతో రైతులు చేతికొచ్చిన పత్తిని తీస్తూ.. వెనువెంటనే అమ్మేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే.. పత్తి దిగుబడి ప్రారంభమైనా ఇంకా ప్రభుత్వం సీసీఐ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించలేదు. మార్కెట్‌లో మద్దతు ధర కంటే ఎక్కువ వస్తుందని రెండేళ్లుగా సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేయడం లేదు. పంట చేతికొచ్చే ప్రారంభంలో జిన్నింగ్ మిల్లులను నోటిపై చేస్తున్నామని చెప్పి.. తర్వాత రైతులు బయటి మార్కెట్‌కు వెళ్తున్నారని దాటవేస్తున్నారు. గడిచిన రెండేళ్లుగా ఇదే తంతు కొనసాగుతుంది. ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో సుమారు 5.80 లక్షల ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేశారని వ్యవసాయాధికారుల లెక్కలు చెబుతున్నాయి.

**మార్కెట్‌లో ఇష్టారాజ్యంగా..**

రైతులకు పత్తి విత్తనాలు సరఫరా చేసే వ్యాపారులు పంట దిగుబడి వచ్చాక తామే కొంటామని చెబుతున్నా.. కొన్ని రోజులు గడిచాక పత్తి సరిగా లేదని వ్యాపారులు మొహం చాటేస్తున్నారు. మరికొందరు వ్యాపారులు తమకు ఇష్టం వచ్చినట్లుగా ధర వెచ్చిస్తున్నారు. పత్తికి మార్కెట్‌లో ప్రారంభ దశలో రూ.9– 10 వేల ధర పలుకుతున్నా.. వ్యాపారులు రూ.6– 7 వేలు మాత్రమే చెల్లిస్తుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

**టెండర్లు పూర్తి..**

ఉమ్మడి జిల్లాలో ఈ వానాకాలంలో సుమారు 5.80 లక్షల ఎకరాల్లో పత్తిసాగు చేయగా.. సుమారు 41.19 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది పత్తి క్వింటాల్ రూ.7,521 మద్దతు ధర ప్రకటించగా.. తేమ శాతాన్ని బట్టి ధరలో వ్యత్యాసం ఉంటుందని సీసీఐ అధికారులు చెబుతున్నారు. సీసీఐ మాత్రం ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా టెండర్లు పిలిచి ఇప్పటికే ఆ పనులను పూర్తిచేసింది. చివరికి మార్కెట్‌లో ధర ఎక్కువగా ఉందని, గతంలో లాగానే సీసీఐ కొనుగోలు కేంద్రాలను నడపలేమని చేతులు దులుపుకొంటున్నారు.

**ఉమ్మడి జిల్లాలో మూడేళ్లుగా పత్తి సాగు ఇలా..**

| జిల్లా | 2022 | 2023 | 2024 |
|---|---|---|---|
| నాగర్‌కర్నూల్ | 3,52,429 | 2,35,530 | 2,10,970 |
| జోగుళాంబ గద్వాల | 2,22,908 | 1,44,075 | 1,20,597 |
| నారాయణపేట | 2,05,607 | 1,84,597 | 1,65,150 |
| మహబూబ్‌నగర్ | 1,15,380 | 85,630 | 79,128 |
| వనపర్తి | 21,689 | 17,411 | 12,301 |

**కొనుగోలు కేంద్రాలు ఇలా..**

ఉమ్మడి జిల్లాలోని కల్వకుర్తి, అచ్చంపేట, నాగర్‌కర్నూల్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, నారాయణపేట, మక్తల్, అలంపూర్, గద్వాల ప్రాంతాల్లో సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు సంబంధించి సీసీఐ టెండర్లు పిలిచింది. అయితే గత రెండేళ్లుగా వీటిని ఏర్పాటు చేయడం లేదు. సీసీఐ కేంద్రాలపై సంబంధిత శాఖ అధికారులు మాత్రం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని, అందుకు సంబంధించిన వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని చెబుతున్నారు.

**ఇబ్బందులు పడ్డాం..**



గత రెండేళ్లుగా సీసీఐ కొనుగోలు కేంద్రాలు లేక పత్తి రైతులమంతా చాలా ఇబ్బందులు పడ్డాం. ప్రైవేట్ వ్యాపారుల వద్ద మద్దతు ధర లేక సాగు మానేసే పరిస్థితులు దాపురించాయి. మద్దతు ధర లేక ఇబ్బందులు పడుతున్న పత్తి రైతులకు సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర కల్పించాలి. అలాగే రంగు మారిన పత్తిని కూడా కొంటేనే రైతులకు మేలు జరుగుతుంది.

– రవి, రైతు, తాండ్ర, కల్వకుర్తి

**మద్దతు ధర ఇవ్వాలి..**



పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకునేలా మద్దతు ధరను రూ.10 వేలు ఇవ్వాలి. అందుకు అనుగుణంగా సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేయాలి. వర్షాకాలం ఆరంభ దశలో అనుకున్నంత స్థాయిలో వర్షాలు రాక, ఇప్పుడు వర్షాలు పడటంతో పత్తిలో తేమ శాతం ఎక్కువగా ఉంది. ప్రభుత్వమే సీసీఐ ద్వారా ఎలాంటి పత్తినైనా కొనుగోలు చేసేలా చూడాలి.

– లక్ష్మయ్య, రైతు, జూపల్లి, చారకొండ

**దసరా తర్వాత..**

పత్తి కొనుగోలుకు సంబంధించి సీసీఐ కేంద్రాల ఏర్పాటుకు టెండర్లు పూర్తిచేశాం. ప్రస్తుతానికి పంటను పరిశీలించడానికి మా టీం సభ్యులు పూర్తిస్థాయిలో సర్వే చేస్తున్నారు. పంట దిగుబడి వచ్చినా.. ప్రస్తుతం తేమ శాతం ఎక్కువగా ఉంటుంది. దసరా దాటిన తర్వాత సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు చేస్తాం.

– రమేష్, సీసీఐ అధికారి, నాగర్‌కర్నూల్

## డిజిటల్ కార్డుల జారీలో పొరపాట్లు ఉండొద్దు



ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్:** ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీలో కుటుంబ సభ్యుల వివరాల నమోదులో ఎలాంటి పొరపాట్లకు తావివ్వొద్దని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి ఫ్యామిలీ డిజిటల్ కార్డుల, ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, డబుల్ బెడ్‌రూం, ధాన్యం తదితర అంశాలపై కలెక్టర్లతో వీసీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో దరఖాస్తుల స్థితిగతులను పరిశీలించేందుకు కమిటీని ఏర్పాటు చేస్తామని, క్షేత్రస్థాయిలో పర్యటించి అన్ని విధాల అర్హులైన లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. వీసీ అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టే కుటుంబ డిజిటల్ గుర్తింపు కార్డులను సమర్థవంతంగా నిర్వర్తించాలని ఆదేశించారు. ప్రతి నియోజకవర్గానికి ఒక ప్రత్యేకాధికారి పర్యవేక్షణ ఉంటుందని, క్షేత్రస్థాయిలో అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబాల సమగ్ర వివరాలను సేకరించి నమోదు చేయాలని సూచించారు. జిల్లాలో నాన్ లే అవుట్ భూముల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్న లే అవుట్ ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను ప్రభుత్వం విధించిన గడువులోగా పూర్తిచేయాలన్నారు. దీనిపై మండల, మున్సిపల్ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి దరఖాస్తుదారులకు ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను వివరించాలని చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్ దేవసహాయం, డీపీఓ రాంమోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

- లే అవుట్ రెగ్యులేషన్ స్కీంలో భాగంగా గతంలో ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న బండారి జయమ్మ ప్లాటును కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. మున్సిపాలిటీలోని కొల్లాపూర్ చౌరస్తా సమీపంలో సర్వే నం.73లో ప్లాట్ నం. 35కు సంబంధించి వివరాలను పంచాయతీ కార్యదర్శి శశికళను అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలన చేసిన దరఖాస్తుల్లో న్యాయబద్ధంగా ఉన్న వాటిని వెంటనే ఆమోదించాలన్నారు. ఆయన వెంట డీఎల్‌పీఓ వరలక్ష్మి, ఏడబ్ల్యూఓ వెంకన్న, ఎంపీఓ భరత్ తదితరలున్నారు.

## విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించాలి

**తాడూరు:** విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని వెలికితీసేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని అదనపు కలెక్టర్ దేవసహాయం అన్నారు. మంగళవారం స్థానిక కేజీబీవీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనికిరాని సింగిల్ యూస్ ప్లాస్టిక్ చేత ఉపయోగకరమైన పరికరాలు తయారు చేయడం, పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని బయటకు తీసుకురావడంలో తోడ్పడుతుందన్నారు. పాఠశాల ఆవరణలో ఫ్రం వేస్ట్ మెటీరియల్ రీయూస్ మేళా కార్యక్రమం చాలా బాగుందన్నారు. కేజీబీవీ విద్యార్థులు ఎంతో ప్రయోగాత్మకంగా వేస్ట్ మెటీరియల్‌ను రీయూజ్ చేసే విధంగా పరికరాలు డెకరేషన్ పరంగా తయారు చేసి సఫలమయ్యారన్నారు. గ్రామాల్లోని పరిసరాలు ఉన్న వేస్ట్ మెటీరియల్‌ను ఉపయోగించి డెకరేషన్ వస్తువులు తయారు చేయడం ద్వారా పరిసరాలు శుభ్రంగా ఉండి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడుతాయన్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు, చేతుల శుభ్రతపై నిర్వహించిన నాటిక ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపన్యాస, పెయింటింగ్ పోటీల్లో ప్రతిభకనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీఓ బ్రహ్మాచారి, జీసీడీఓ శోభారాణి, కోఆర్డినేటర్ ఊశన్న, కార్యదర్శి పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులు తయారు చేసిన వస్తువులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దేవసహాయం

## ఆలయాల భూములు ఆక్రమిస్తే సహించం

**తెలకపల్లి:** ఉప్పునుంతల మండలం మామిళ్లపల్లి గ్రామ లక్ష్మీ నర్సింహస్వామి ఆలయ భూముల్లో అక్రమంగా నిర్మాణాలు చేపడితే సహించే ప్రసక్తే లేదని అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. తెలకపల్లిలోని అచ్చంపేట రోడ్డులో సర్వే నం.542లో మామిళ్లపల్లి లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి సంబంధించిన భూ వివాదం కొనసాగుతుంది. దీనిపై మంగళవారం సర్వే అధికారులు ఆశిష్‌రెడ్డి, దేవాదాయ శాఖ అధికారులు ఈఓ నర్సింహులు, ఆర్‌ఐ రామస్వామి, ఎస్‌ఐ నరేష్ ఆధ్వర్యంలో అధికారులు సర్వే నిర్వహించారు. దీనిపై ఎమ్మెల్యే స్థానిక విలేకరులతో ఫోన్‌లో మాట్లాడారు. ఆలయానికి సంబంధించి దాసుపల్లి, నడిగడ్డ, తెలకపల్లి తదితర గ్రామాల్లో స్వామివారి భూములు ఉన్నాయన్నారు. సర్వే నం.542లో 12.6 ఎకరాలు, సర్వే నం.505లో 19.17 ఎకరాల భూమి ఉందని, అయితే కొంత మంది ఈ భూమిని ఆక్రమించారన్నారు. ఇది పూర్తిగా దేవాదాయ శాఖకు సంబంధించిన భూమి అని, దీనిలో అక్రమ నిర్మాణాలు చేపడితే.. ఎలాంటి నోటీసులు లేకుండా కూల్చివేస్తామన్నారు. గతంలో ఆలయ భూముల్లో ఇళ్లు ఇతర నిర్మాణాలను తొలగించేలా వారితో సమావేశమై మాట్లాడుతామన్నారు. స్వామివారికి భూములకు సంబంధించిన ఆదాయాన్ని ఆలయ అభివృద్ధికే ఖర్చు చేస్తామన్నారు. ఇదిలా ఉండగా సర్వే నం.542లో నిర్మాణాలు చేపట్టిన ఈశ్వర్ అనే రైతు మాట్లాడుతూ తన తాతల నాటి నుంచి ఈ భూమి తమ ఆధీనంలో ఉందని, ఇప్పుడు ఆలయ భూమి అని సర్వే చేపట్టారని ఆవేదన వ్యక్తం చేశారు.



తెలకపల్లి శివారులోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయ భూమిలో సర్వే చేస్తున్న అధికారులు

## జోగుళాంబ ఆలయ పాలకమండలి నియామకం

**జోగుళాంబ శక్తిపీఠం:** అష్టాదశ శక్తిపీఠాల్లో అయిదో శక్తిపీఠమైన అలంపూర్ శ్రీజోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి దేవస్థానానికి నూతన పాలక మండలిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. అమ్మవారి ఆలయంలో జోగుళాంబదేవి శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలను దృష్టిలో ఉంచుకుని త్వరితగతిని ఈ పాలక మండలిని నియమించింది. ఇందులో బి.నాగేశ్వర్‌రెడ్డి, జయరాముడు, జగన్‌మోహన్‌నాయుడు, నాశిరోమణి, ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, పి.విశ్వనాథ్‌రెడ్డి, జగదీశ్వర్‌గౌడ్, వెంకటేశ్వర్లు, కుర్వ గోపాల్, సురేంద్రస్వామి, జె.సరస్వతి, వెంకటేశ్వర్లు, జి.పులేందర్, ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఆలయ ప్రధాన అర్చకుడు ఆనంద్‌శర్మను నియమిస్తూ జీఓ జారీచేశారు. కాగా ఇందులో డోనర్ కింద మరో సభ్యుడు ఉండాల్సి ఉంది. ఏడాదిపాటు ఈ కాలపరిమితి ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొంది. జోగుళాంబ దేవీ శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో పాలక మండలి నియామకానికి ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ కృషిచేశారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి





కోర్టు ప్రాంగణంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహిస్తున్న జడ్జి రాజేష్‌బాబు తదితరులు

**నాగర్‌కర్నూల్ క్రైం:** ప్రతి వ్యక్తి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే ఆరోగ్యంగా జీవించే అవకాశం ఉంటుందని జిల్లా జడ్జి రాజేష్‌బాబు అన్నారు. రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ప్రాంగణంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జిల్లా కోర్టు నుంచి గాంధీపార్క్ వరకు ర్యాలీ నిర్వహించి గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ అహింసా వాదంతో స్వాతంత్య్ర పోరాటంలో ముందుండి నడిపించిన ఘనత గాంధీ మహాత్ముడికే దక్కుతుందన్నారు. బుధవారం గాంధీ జయంతిని ప్రతి ఒక్కరు జరుపుకోవాలని, మహాత్మగాంధీని ఎన్నో ప్రపంచ దేశాలు ఆదర్శంగా తీసుకుని అహింసా మార్గంలో స్వాతంత్ర్యాలు సాధించాయని గుర్తుచేశారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి సబిత, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మౌనిక తదితరులు పాల్గొన్నారు.



### కాటన్‌మిల్లు కార్మిక సంఘం ఎన్నికల్లో సూర్యప్రకాశ్ గెలుపు

– కల్వకుర్తి

వివరాలు 10లో..



### ఒక్కేసి.. పువ్వేసి.. చందమామ

– కల్వకుర్తి

వివరాలు 11లో..

# కర్షకులకు చేరువగా రైతువేదికలు

- ఆధునిక పరిజ్ఞానంతో వీసీల ఏర్పాటు
- జిల్లాలోని 20 క్లస్టర్లలో అందుబాటులోకి..
- శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు నేరుగా ముఖాముఖి
- సాగులో విప్లవాత్మక మార్పులపై అవగాహనకు అవకాశం





అచ్చంపేట మండలంలోని పులిజాల రైతు వేదిక

**అచ్చంపేట రూరల్:** గ్రామీణ కర్షకులకు సలహాలు, సూచనలు అందిస్తే అధిక దిగుబడులు సాధించేందుకు అవకాశం ఉంటుంది. సరైన పరిజ్ఞానం లేక వ్యాపారులు చెప్పింది వింటూ నష్టపోతుంటారు. మండల కేంద్రాల్లో ఉండే వ్యవసాయాధికారులను కలిసేందుకు వెళ్లడం కష్టంగా ఉండేది. దీనిని దృష్టిలో పెట్టుకొని గత ప్రభుత్వం ప్రతి క్లస్టరుకు ఒక రైతువేదికను నిర్మించింది. వాటిలో ఏఈఓలు తప్పనిసరిగా ఉండేలా చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో ప్రస్తుత రైతువేదికలను మరింత పటిష్టం చేసే దిశగా చర్యలు చేపట్టింది. ప్రతి మండలంలో రైతులకు అందుబాటులో ఉండే విధంగా 'రైతునేస్తం' ద్వారా రైతువేదికలో వీడియో కాన్ఫరెన్సులను ఏర్పాటు చేసింది. జిల్లాలోని 20 మండలాల్లోని రైతు వేదికల్లో వీసీలు అందుబాటులోకి వచ్చాయి.

**అన్ని అంశాలపై సలహాలు, సూచనలు**

వ్యవసాయం రంగంలో ఆధునిక పరిజ్ఞానం రైతులకు మరింత చేరువయ్యేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పంటల సాగులో మెలకువలు, ఆధునిక పద్ధతులపై క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించడంతోపాటు సందేహాలను నివృత్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం మార్చి నుంచి ప్రతి మంగళవారం రైతునేస్తం కార్యక్రమం నిర్వహిస్తోంది. జిల్లాలోని 20 మండలాల్లోని రైతువేదికల్లో వీడియో కాన్ఫరెన్సులను వ్యవసాయ శాఖ చేపడుతోంది. రైతువేదికల్లో వీడియో కాన్ఫరెన్సుకు సంబంధించిన ఎలక్ట్రికల్ పరికరాలు కంప్యూటర్, మైకులు, ఇన్వర్టర్ బ్యాటరీలతోపాటు నెట్ కనెక్షన్ ద్వారా నిర్వహిస్తున్నారు. శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు నేరుగా రైతులతో ముఖాముఖి నిర్వహించడంతోపాటు సాగులో మెలకువలు, వ్యవసాయ రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులు, పంటల తెగుళ్లు, చీడపీడల నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆధునిక పద్ధతులు, యాంత్రీకరణ, నూతన వంగడాలపై రైతులకు ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు అందేలా చూస్తారు. వ్యవసాయంతోపాటు అనుబంధ రంగాలపై కూడా వీసీలో చర్చిస్తున్నారు. రెండురోజుల ముందే రైతులకు సంబంధిత అంశాన్ని తెలియజేస్తుండటంతో ఆ రోజున తమ సందేహాలను నివృత్తి చేసుకోవడానికి వీలవుతుందని రైతులు పేర్కొంటున్నారు.



అచ్చంపేట మండలంలోని పులిజాల రైతువేదికలో బిగించిన వీసీ పరికరాలు

**రైతులకు ఎంతో మేలు..**



రైతువేదికలకు వీడియో కాన్ఫరెన్సు మంజూరు కావడంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. జిల్లాలోని 20 మండలాల్లో ప్రతి దానికి ఒకటి చొప్పున వీసీలు మంజూరయ్యాయి. ఎప్పటికప్పుడు పంటల సాగులో మెలకువలను తెలియజేసే వీలుంటుంది. రైతులు రైతువేదికల వద్దకు వెళ్లి అవగాహన సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి.

– చంద్రశేఖర్, జిల్లా వ్యవసాయాధికారి

### రక్తదానం చేసి ప్రాణదాతలుకండి



**నాగర్‌కర్నూల్ క్రైం:** రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్న ఎన్నో ప్రాణాలు నిలుస్తాయని జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘు అన్నారు. జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం జిల్లాకేంద్రంలోని జనరల్ ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్‌లో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడం సామాజిక బాధ్యతగా గుర్తించుకోవాలని, యువజన సంఘాలు, రక్తదాతలు స్పందించి రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి రమేష్‌రెడ్డి, జిల్లా యూత్ కన్వీనర్ కుమార్, ఆర్‌ఎంఓలు దశరథ్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### మహిళ మృతదేహం లభ్యం



లక్ష్మమ్మ (ఫైల్)

వెల్దండ: మండలంలోని చెర్కూర్‌కు చెందిన కేశమోని లక్ష్మమ్మ (55) గత నెల 29న అదృశ్యం కాగా.. మంగళవారం గ్రామ సమీపంలోని బచ్చిరెడ్డి వ్యవసాయ పొలంలో ఉన్న బావిలో ఆమె మృతదేహం లభ్యమైనట్లు ఎస్‌ఐ కురుమూర్తి తెలిపారు. ఆయన కథనం మేరకు.. గత నెల 26న పొలంలో కట్టేసిన పశువులను గుర్తు తెలియని వ్యక్తులు తీసుకెళ్లారు. వాటికి వెతకడానికి వెళ్లిన ఆమెకు ఆచూకీ లభించకపోవడంతో మనస్తాపానికి గురై బావిలో పడి ఆత్మహత్య చేసుకున్నట్లు చెప్పారు. గ్రామస్తుల సహకారంతో మృతదేహాన్ని బావి నుంచి బయటకు తీసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. లక్ష్మమ్మకు భర్త కృష్ణయ్య, ముగ్గురు కుమారులు ఉన్నారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



అప్పంపల్లి రఘు (ఫైల్)

నర్వ: పురుగుమందు తాగిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతి చెందినట్లు ఎస్‌ఐ కురుమయ్య తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని ఎల్లంపల్లికి చెందిన అప్పంపల్లి రఘు (34)కు సంధ్యతో 14 ఏళ్ల కిందట వివాహం కాగా.. వీరికి ఒక కుమార్తె కూడా ఉంది. 20 రోజుల కిందట భార్యాభర్తలు గొడవపడటంతో సంధ్య పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపానికి గురైన రఘు గత నెల 24న పురుగుమందు తాగగా.. గ్రామస్తులు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతిచెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

### కాంట్రాక్టు ఉద్యోగి బలవన్మరణం



ఆశన్న (ఫైల్)

నాగర్‌కర్నూల్ (బిజినేపల్లి): తిమ్మాజిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఆశన్న (44) అనే కాంట్రాక్టు ఉద్యోగి మంగళవారం తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి వివరాల మేరకు.. కొన్ని రోజులుగా ఆశన్న కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. చికిత్సల నిమిత్తం ఎన్ని ఆస్పత్రులు తిరిగినా నయం కాకపోవడంతో మనస్థాపానికి గురై ఇంట్లోనే ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని చికిత్స నిమిత్తం జడ్చర్ల ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య రాధిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### కల్వకుర్తిలో మరొకరు..

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని మార్కెట్ యార్డు ఆవరణలో ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ రాంచంద్‌జీ వివరాల మేరకు.. పట్టణంలోని గాంధీనగర్ కాలనీకి చెందిన వాసు (50) ప్రైవేటు డ్రైవర్‌గా, అతడి భార్య కాటన్ మిల్లులో కార్మికురాలిగా పనిచేస్తున్నారు. కొన్ని రోజులుగా వాసు ఇంట్లో గొడవ పడుతూ మద్యానికి బానిసయ్యాడు. రోజు మాదిరిగానే మంగళవారం ఇంట్లో గొడవపడి.. ఉదయం 11 గంటల ప్రాంతంలో బయటకు వెళ్లిన అతడు.. మార్కెట్ యార్డు ఆవరణలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడు



మహ్మద్ తాకీర్ శరీరంపై గాయాలు

నాగర్‌కర్నూల్ క్రైం: ఓ విద్యార్థిని ఉపాధ్యాయుడు చితకబాదడంతో తీవ్ర గాయాలైన ఘటన జిల్లాకేంద్రంలో సోమవారం చోటు చేసుకోగా మంగళవారం వెలుగు చూసింది. బాధితుల కథనం మేరకు.. బిజినేపల్లికి చెందిన మహ్మద్ తాహెర్ కుమారుడు మహ్మద్ తాకీర్ జిల్లాకేంద్రంలోని ప్రీజం పాఠశాలలో పదోతరగతి చదువుతున్నారు. సోమవారం తరగతి గదిలో తాకిర్ నవ్వడంతో గణిత ఉపాధ్యాయుడు పవన్‌కుమార్ కట్టెతో విచక్షణారహితంగా కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. పాఠశాల ముగిసిన తర్వాత సాయంత్రం ఇంటికి వెళ్లాక శరీరంపై గాయాలను తల్లిదండ్రులు గుర్తించారు. మంగళవారం ఉదయం విద్యార్థి తండ్రి కుటుంబ సభ్యులతో కలిసి పాఠశాలకు వద్ద ఆందోళన చేయడంతో యాజమాన్యం ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో విరమించారు. ఘటనపై విద్యాధికారికి ఫిర్యాదు చేయనున్నట్లు విద్యార్థి తండ్రి తాహెర్ తెలిపారు.

# పట్టుదలతో కొలువు కొట్టారు





డీఎస్సీ ఫలితాల్లో ఆయా విభాగాల్లో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పలువురు అభ్యర్థులు సత్తాచాటారు. జనరల్ ర్యాంకింగ్ లిస్టులో జిల్లా టాపర్లుగా నిలిచారు. కొందరు ఒక ఉద్యోగంలో, మరికొందరు ఒకేసారి రెండు ఉద్యోగాల్లో సత్తా చాటి ఔరా అనిపించారు. ఈ నేపథ్యంలో ఆయా విభాగాల్లో జిల్లాల్లో ప్రథమ స్థానంలో నిలిచిన వారి అభిప్రాయాలు వారి మాటల్లోనే..

– సాక్షినెట్‌వర్క్

### సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదిలీ..



నాపేరు స్వప్న, నాన్న సత్యారెడ్డి, అమ్మ కమలమ్మ. మక్తల్ మండలంలోని జక్లేర్ స్వగ్రామం. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదలి బీఎడ్ చేశాను. ఇంటి దగ్గర ఆన్‌లైన్ యాప్‌లలో వింటూ డీఎస్సీకి సన్నద్ధమయ్యాను. రాత్రి 12 గంటల వరకు చదివేదాన్ని. నాభర్త, అత్తమ్మ ఎంతో సహకరించారు. నారాయణపేట జిల్లాస్థాయిలో గణితంలో 87.33 మార్కులు సాధించి మొదటి ర్యాంకు సాధించా. – స్వప్న, నారాయణపేట

### కూలీ చేసి చదివించారు



మాది అమరవాయి గ్రామం. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్న పట్టుదలతో చదివాను. గతంలో తెలుగు జూనియర్ లెక్చరర్, పీఈటీ, ఈజీటీ పోస్టులను ఒకేసారి సాధించాను. మళ్లీ డీఎస్సీ రాయగా స్కూల్ అసిస్టెంట్ తెలుగులో 79.5 మార్కులు జోగుళాంబ జిల్లాలో మొదటి ర్యాంక్, లాంగ్వేజ్ పండిట్ తెలుగులో 80 మార్కులతో జిల్లా మొదటి ర్యాంక్ సాధించాను. మా అన్న అహ్మద్‌బాషా సహకారం అందించారు. అమ్మతో పాటు నా భార్య కూలీ చేసి చదివించారు.

– కబులసాబ్, జోగుళాంబ గద్వాల

### అమ్మదీవెనతో..



చిన్నప్పుడే నాన్న ఎండీ కరీం మరణించారు. అమ్మ అబేదా బేగం మండల కేంద్రంలో రోడ్డు పక్కన పుట్నాల వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషించింది. ఆమె దీవెనలతోనే డీఎస్సీలో ఉద్యోగం సాధించగలిగాను. ఎస్‌ఏ, ఎస్జీటీ ఉర్దూ మీడియం విభాగంలో ర్యాంక్‌లు వచ్చాయి.

– జరీనా బేగం, నాగర్‌కర్నూల్ జిల్లా

### ప్రణాళికతో చదివాను



ప్రణాళికతో చదివి డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్ విభాగంలో 72.07 మార్కులతో జిల్లా మొదటి ర్యాంక్ సాధించాను. మైనార్టీ గురుకుల పాఠశాలలో ప్రస్తుతం ఇంగ్లీష్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాను. నాన్న చిన్న రమేష్ ఆర్టీసీలో మెకానిక్‌గా పని చేస్తున్నాడు. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే తలంపుతో డీఎస్సీకి ప్రిపేర్ అయ్యాను. జిల్లా మొదటి ర్యాంక్ రావడం సంతోషంగా ఉంది.

– చిన్న అక్షయ్, వనపర్తి

### నాన్న ఆశయం నెరవేర్చా



మా నాన్న గాండ్ల బస్వరాజ్ కష్టపడి వ్యవసాయం చేస్తూ 4 గురిని చదివిస్తున్నాడు. ఆయన కష్టాల్ని చూసి నేను ప్రభుత్వం ఉద్యోగం సాధించాలని పట్టుదలతో చదివాను. ఎస్జీటీలో 87.37 మార్కులు సాధించి జిల్లాలో మొదటి ర్యాంకు సాధించడం సంతోషంగా ఉంది.

– ప్రియాంక, ఎడవెల్లి, ఊట్కూర్, నారాయణపేట

### చాలా సంతోషంగా ఉంది



డీఎస్సీలో ఎస్‌జీటీ(స్పెషల్ ఎడ్యుకేషన్)లో జిల్లా మొదటి ర్యాంకు, ఎస్‌ఏలో జిల్లా మూడో ర్యాంకు వచ్చినందుకు చాలా సంతోషంగా ఉంది. మొదటి నుంచి టీచర్ ఉద్యోగం చేయాలనే లక్ష్యంతోనే చదివా. ప్రస్తుతం కర్నూల్‌లో రైల్వేలో గ్రూప్ డి ఉద్యోగం చేస్తూనే మరో వైపు డీఎస్సీకి ప్రిపేరయ్యాను. 2008లో డీఎస్సీకి క్వాలిఫై కూడా అయ్యాను.

– వాకిటి ఆంజనేయులు, మహబూబ్‌నగర్

### భర్త ప్రోత్సాహంతో..



భర్త ఎండీ అబ్దుల్లా ప్రోత్సాహం, ఉపాధ్యాయ వృత్తిని చేయాలనే సంకల్పం తోడు కావడంతో డీఎస్సీ ఫలితాల్లో జిల్లాలో మొదటి ర్యాంక్ రావడం గర్వంగా ఉంది. ఉర్దూ మీడియం విభాగంలో చేపట్టబోయే ఉపాధ్యాయ వృత్తికి న్యాయం చేస్తాను. భర్తతో పాటు కుటుంబ సభ్యుల ఆకాంక్ష నెరవేరింది. – అఫ్రీన్ జాబిన్, నాగర్‌కర్నూల్ జిల్లా

### కుటుంబం ప్రోత్సాహంతో..



డీఎస్సీ నోటిఫికేషన్ వచ్చిన సమయంలో రెండు నెలల బాబు ఉన్నాడు. ఆ సమయంలో బాబు బాగోగులు చూసుకోవడం, చదవడం కష్టంగా మారింది. టీచర్ కావాలనే నా లక్ష్యానికి తల్లిదండ్రులు భాగ్యమ్మ, వెంకటేష్, భర్త భాను ప్రకాష్ సహకారం అందించడంతో చదువుపై దృష్టి పెట్టాను. దీంతో స్పెషల్ ఎడ్యుకేషన్‌లో జిల్లా మొదటి ర్యాంక్ సాధించగలిగాను. మొదటి ర్యాంక్ రావడం పట్ల చాలా సంతోషంగా ఉన్నాను. – జి. కావ్య, వనపర్తి

### నాన్న కోరిక



ప్రభుత్వ ఉద్యోగం చేయాలనేది మానాన్న బలమైన కోరిక. అందుకు తగినట్లుగా నా భర్త పూర్తిస్థాయిలో ప్రోత్సాహం అందించారు. రెండేళ్లపాటు ఇంట్లో ఉంటూ ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాను. ఏడేళ్లుగా సాక్షిపత్రిక చదువుతుండటంతో కరెంట్ అఫైర్స్ బాగా ఉపయోగపడ్డాయి. స్కూల్ అసిస్టెంట్, లాంగ్వేజ్ పండిట్ రెండింటిలోనూ జిల్లా ర్యాంక్ సాధించగలిగాను. –శ్వేత, మహబూబ్‌నగర్ జిల్లా

### కోచింగ్ లేకుండానే..



డీఎస్సీ ప్రిపరేషన్‌కు ప్రత్యేంగా కోచింగ్ ఏమీ తీసుకోలేదు. పక్కా ప్రణాళికలతో ఇంట్లోనే ప్రిపేర్ అయ్యా. నాకు ఇద్దరు చిన్నపిల్లలు ఉండడంతో కోచింగ్ వెళ్లేందుకు వీలుకాలేదు. వారిని స్కూల్‌కు పంపిన తరువాత ఇంట్లోనే చదివేదాన్ని. బయోసైన్స్‌లో 82.47 మార్కులతో జిల్లా టాపర్‌గా నిలవడం చాలా ఆనందంగా ఉంది. ప్రిపరేషన్‌లో కుటుంబ సభ్యుల సహకారం మరువలేనిది.

– మాలతి, నాగర్‌కర్నూల్ జిల్లా

### ట్యూషన్‌లు చెప్తూ చదివా..



స్కూల్ అసిస్టెంట్ తెలుగులో జిల్లాలో టాపర్‌గా నిలవడం సంతోషంగా ఉంది. 2018 డీఎస్సీలో జాబ్ మిస్సైంది. దీంతో ఈసారి కచ్చితంగా ఉద్యోగం సాధించాలనే పట్టుదలతోనే చదివా. మూడేళ్ల క్రితం నాన్న చనిపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడాల్సి వచ్చింది. అయితే ట్యూషన్‌లు చెప్తూనే ప్రిపేర్ అయ్యా. 81.70 మార్కులతో మొదటి స్థానంలో నిలిచా.

– శ్యాంసుందర్, నాగర్‌కర్నూల్‌జిల్లా

## ఆకట్టుకున్న వేస్ట్ టు ఆర్ట్ ఎగ్జిబిషన్



విద్యార్థులు రూపొందించిన వేస్ట్ టు ఆర్ట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేందిర

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): స్వచ్ఛతా హీ సేవ పక్షోత్సవాలను పురస్కరించుకొని మహబూబ్‌నగర్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన వేస్ట్ టు ఆర్ట్ ఎగ్జిబిషన్ అందరినీ ఆకట్టుకుంది. డీఆర్డీఓ, పంచాయతీ రాజ్, విద్యాశాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నవాబుపేట, దేవరకద్ర ప్రాథమికోన్నత పాఠశాల, పెద్దరాజమూర్ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులతో పాటు ధర్మాపూర్ జీపీ మంగలిగడ్డ తండా, మిడ్జిల్, బూరుగుపల్లి, కోయిల్‌కొండ, రాజాపూర్ పంచాయతీ కార్యదర్శులు వ్యర్థాలతో రూపొందించిన వస్తువులను ప్రదర్శించారు. ప్రదర్శనలను కలెక్టర్ విజయేందిర తిలకించి, అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. అనంతరం డీఆర్డీఓ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, డీఆర్డీఓ నర్సింహులు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి మధుసూదన్‌గౌడ్, అడిషనల్ పీడీ జోజప్ప పాల్గొన్నారు

## కాటన్‌మిల్లు కార్మిక సంఘం ఎన్నికల్లో సూర్యప్రకాశ్ గెలుపు



గెలుపు సంబరాలలో పాల్గొన్న కాటన్‌మిల్లు కార్మికులు



సూర్యప్రకాశ్

కల్వకుర్తి: ఉత్కంఠ భరితంగా కొనసాగిన కాటన్ మిల్లు కార్మిక సంఘం అధ్యక్షుడి ఎన్నికల్లో బీఆర్‌ఎస్ బలపర్చిన సూర్యప్రకాశ్ గెలుపొందారు. మండలంలోని మార్చాల సమీపంలోని సూర్యలత కాటన్ స్పిన్నింగ్ మిల్లు కార్మిక సంఘం ఎన్నికలను మంగళవారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ తరపున ఆనంద్‌కుమార్, బీఆర్‌ఎస్ తరపున సూర్యప్రకాశ్‌లు పోటీలో ఉన్నారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్‌లో.. మిల్లులో పనిచేసే కార్మికులు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఉయం 10.30 గంటలలోపే 95 శాతం పోలింగ్ పూర్తయినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, డిప్యూటీ లేబర్ కమిషనర్ చంద్రశేఖర్ గౌడ్ తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు ఓట్ల లెక్కింపు చేపట్టారు.

**ఓటు వేసిన 438 మంది..**

కాటన్‌మిల్లు కార్మికుల సంఘం అధ్యక్షుడి ఎన్నికలో 450 మంది ఓటర్లుగా ఉన్నారు. వీరిలో 438 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. మధ్యాహ్నం తర్వాత చేపట్టిన ఓట్ల లెక్కింపులో సూర్యప్రకాశ్‌కు 251, ఆనంద్ కుమార్‌కు 183 ఓట్లు పోలయ్యాయి. 4 ఓట్లు చెల్లనవిగా ఉన్నాయి. సూర్యప్రకాశ్ తన సమీప ప్రత్యర్థిపై 68 ఓట్ల మెజారీతో విజయం సాధించినట్లు రిటర్నింగ్ అధికారి చంద్రశేఖర్‌గౌడ్ ప్రకటించారు.

**ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం పోయింది..**

ప్రస్తుత ప్రభుత్వంపై ప్రజలు విశ్వాసాన్ని కోల్పోయారని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. కాటన్‌మిల్లు కార్మికుల సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన బీఆర్‌ఎస్ అభ్యర్థి సూర్యప్రకాశ్‌ను ఆయన శాలువాతో సన్మానించి అభినందించారు. అనంతరం కాటన్‌మిల్లు నుంచి మున్సిపల్ చైర్మన్ సత్యం, కౌన్సిలర్లతో కలిసి కార్మికులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఎన్నికల్లో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మహేంద్ర, ప్రిసైడింగ్ అధికారి రాజ్‌కుమార్, కాటన్‌మిల్లు మాజమాన్యం, కార్మికులు పాల్గొన్నారు.

## పీయూలో పీడీఎస్‌యూ పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పీయూ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ డా.మధుసూదన్ రెడ్డి, నాయకులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పీడీఎస్‌యూ 50 వసంతాల సభలను విజయవంతం చేయాలని మంగళవారం స్థానిక పీయూలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు పవన్‌కుమార్ ఆధ్వర్యంలో పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఐదు దశాబ్దాలుగా శాస్త్రీయ విద్య సాధన, విద్యార్థుల హక్కుల కోసం పోరాడుతున్నామన్నారు. విద్యారంగాన్ని కార్పొరేట్, ఎంఎన్‌సీలకు అప్పజెప్పే పనిలో కేంద్ర ప్రభుత్వం ఉందని ఆరోపించారు. కనీస నిధులైనా కేటాయించకుండా ప్రభుత్వ విద్యా సంస్థలను నిర్వీర్యం చేసే దిశగా అడుగులు వేస్తోందని విమర్శించారు. రాష్ట్రంలోనూ విద్యా రంగాన్ని పట్టించుకునే స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం లేదని వాపోయారు. కార్యక్రమంలో పీయూ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ డా.మధుసూదన్‌రెడ్డి, ఏఐఎస్‌ఎఫ్ జాతీయ నాయకుడు రాము, పీయూ జేఏసీ చైర్మన్ బత్తిని రాము, ఆంజనేయులు, సురేందర్, సునీల్, వెంకటేష్, గోపాల్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఉదండాపూర్ అక్రమాల నిగ్గు తేలుస్తాం

జడ్చర్ల: ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్మాణానికి సంబంధించి నిర్వాసితులకు ప్రభుత్వం చెల్లించే పరిహారం విషయంలో అక్రమాల నిగ్గు తేలుస్తామని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బోగస్ నిర్వాసితులను గుర్తించేందుకు అవసరం అనుకుంటే ప్రతి ఇల్లు తిరిగి నిజనిజాలను వెలికి తీస్తామని పేర్కొన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో భూముల రికార్డులను ట్యాంపరింగ్ చేసి ప్రభుత్వ భూములను సైతం తమ భూములుగా చూపి పరిహారం తీసుకున్నారని ఆరోపించారు. ఇతరుల భూములకు సంబంధించిన పరిహారాన్ని సైతం తమ బినామీ ఖాతాలకు మళ్లించుకున్నారని, ఆర్‌అండ్‌ఆర్ కింద ఇచ్చే పరిహారాన్ని కూడా నిర్వాసిత గ్రామాలకు సంబంధం లేని వ్యక్తుల పేర్లతో బోగస్ కుటుంబాలను జాబితాలో చేర్చారన్న అనుమానాలు ఉన్నాయని తెలిపారు. అక్రమాలకు సంబంధించి ఎంతటి వారైనా సహించేది లేదని, తమ క్యాంపు కార్యాలయంలో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలని సూచించారు.

## పోటీ పరీక్షల్లో ప్రతిభ

**ఒకేసారి మూడు ఉద్యోగాలు సాధించిన నరేష్‌రెడ్డి**



నరేష్‌రెడ్డి

చారకొండ: మండల కేంద్రానికి చెందిన దొడ్ల కళమ్మ, శేఖర్‌రెడ్డి పెద్ద కుమారుడు దొడ్ల నరేష్‌రెడ్డి మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. ఈయన మహబూబ్‌నగర్‌లో డీఎడ్, అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ, అనంతరం బీఈడీ పూర్తి చేశారు. హైదరాబాద్‌లోని ఓ కంపెనీలో సేల్స్‌మెన్‌గా, డెలివరీ బాయ్‌గా పని చేస్తూ ఎలాంటి కోచింగ్ లేకుండా పోటీ పరీక్షలు రాశారు. ఇటీవల విడుదలైన హెచ్‌డబ్ల్యూఓ ఉద్యోగానికి ఎంపికకాగా.. తాజాగా సోమవారం విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో ఎస్జీటీ, సాంఘికశాస్త్రంలో స్కూల్ అసిస్టెంట్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చారు. స్కూల్ అసిస్టెంట్‌లో జిల్లా 5వ ర్యాంకు వచ్చినట్లు తెలిపారు. ఏకకాలంలో మూడు ఉద్యోగాలు సాధించడంతో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు అతడిని అభినందించారు.

## 50 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



పట్టుబడిన రేషన్ బియ్యం

ఎర్రవల్లి: అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యంను పట్టుకున్నట్లు ఇటిక్యాల ఎస్సై వెంకటేష్ తెలిపారు. ఎర్రవల్లి మండల పరిధిలోని జింకలపల్లి శివారులో పద్మావతి శ్రీనివాస్ రైస్ మిల్లులో అక్రమంగా రేషన్‌బియ్యంను నిల్వ చేసినట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో ఎస్‌ఐ తన సిబ్బందితో కలిసి తనిఖీ చేసి 108 బ్యాగుల (దాదాపు 50క్వింటాళ్లు) రేషన్ బియ్యంను గుర్తించారు.అనంతరం వాటిని సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగించారు. సివిల్ సప్లయ్ అధికారి మహర్షి ఫిర్యాదు మేరకు రైస్ మిల్లు యజమాని చల్లా ప్రకాష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

## వ్యక్తిపై కేసు నమోదు

నవాబుపేట: ఒంటరిగా ఉన్న వివాహితపై అత్యాచారం చేసిన విషయంలో బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు. నవాబ్‌పేట మండల పరిధిలోని రుద్రారం గ్రామానికి చెందిన దండు మైబు గత నెల 23వ తేదీన ఇంట్లో ఒంటరిగా ఉన్న వివాహిత (45)ను చంపేస్తానని భయపెట్టి అత్యాచారం చేశాడు. ఉపాధి కోసం హైదరాబాద్‌కు వెళ్లిన భర్త మంగళవారం గ్రామానికి రాగా.. అత్యాచారం చేసిన విషయాన్ని భార్య ఆయనకు చెప్పింది. దీంతో మైబుపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

## జూరాలకు స్వల్పంగా పెరిగిన ఇన్‌ఫ్లో



జూరాల ప్రాజెక్టు వద్ద 7 క్రస్టు గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న వరద నీరు

ధరూరు/ఆత్మకూరు/శ్రీశైలం: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో స్వల్పంగా పెరిగింది. సోమవారం రాత్రి 68,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. మంగళవారం రాత్రి 7 గంటల వరకు 84,500 క్యూసెక్కులకు పెరిగింది. దీంతో ప్రాజెక్టు 7 క్రస్టు గేట్లను ఎత్తి 49,721 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 36,050 క్యూసెక్కుల నీటిని వినియోగించుకుంటున్నారు. నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750 క్యూసెక్కులు, ఆవిరిరూపంలో 96 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 920 క్యూసెక్కులు, కుడి కాల్వకు 731 క్యూసెక్కులు, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 50 క్యూసెక్కులు, భీమా లిఫ్టు–2కు 750 క్యూసెక్కులు మొత్తం ప్రాజెక్టు నుంచి మొత్తం 88,268 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 9.050 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

- ఎగువ, దిగువ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి వేగవంతంగా కొనసాగుతుందని ఎస్‌ఈలు సురేష్, సూరిబాబు తెలిపారు. ఈ ఏడాది 600 మి.యూనిట్ల లక్ష్యానికి చేరువలో ఉన్నామని తెలిపారు.వరద ఇలాగే కొనసాగితే వందశాతం లక్ష్యాన్ని చేరుకుంటామని పేర్కొన్నారు. 11 యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తిని చేపడుతున్నామని ఎగువలో 5 యూనిట్ల ద్వారా 195 మెగావాట్లు, దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు విద్యుదుత్పత్తిని కొనసాగుతుందన్నారు. ఇప్పటివరకు 408.108 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని సాధించామని తెలిపారు.
- శ్రీశైలం జలాశయానికి రాత్రి 9 గంటల సమయంలో జూరాల నుంచి స్పిల్‌వే ద్వారా 49,721 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి చేస్తూ 36,050, సుంకేసుల నుంచి 4,446 మొత్తం 90,217 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. ఎడమగట్టు భూగర్భ విద్యుత్‌కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 36,163 క్యూసెక్కులు, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో 14,747 మొత్తం 50,910 క్యూసెక్కుల నీటినిసాగర్‌కు విడుదల చేస్తున్నారు. పోతిరెడ్డిపాడు ద్వారా 13,000 క్యూసెక్కులు, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,480 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

### ఒక గేటు ద్వారా నీటి విడుదల

రాజోళి: సుంకేసుల డ్యాంలో ఒక గేటు ద్వారా నీటి విడుదల చేస్తున్నట్లు జేఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 6,891 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. ఒక గేటును తెరిచి 4,446 క్యూసెక్కులు, కేసీ కెనాల్‌కు 2,445 క్యూసెక్కులు వదిలినట్లు పేర్కొన్నారు.

## పూడ్చిన మృతదేహానికి పోస్టుమార్టం



శ్మశానవాటికలో రెవెన్యూ, పోలీసు, గ్రామస్తులు

గద్వాల క్రైం: హైదరాబాద్‌లో గత నెల 27న ఓ వ్యక్తి మృతిచెందగా.. కుటుంబసభ్యులు 28వ తేదీన స్వగ్రామంలోని శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. తర్వాత కుమార్తె తన తండ్రి మృతిపై అనుమానం ఉందని మీర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మంగళవారం మధ్యాహ్నం పూడ్చిన మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిర్వహించారు. గద్వాల తహసీల్దార్ మల్లికార్జున్, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన జగన్నాథంరెడ్డి (52) కుటుంబ సభ్యులతో కలిసి 20 ఏళ్లుగా హైదరాబాద్‌లోని చంపాపేట రెసిడెన్సీకాలనీలో నివాసం ఉంటూ రియల్ వ్యాపారం చేస్తూ జీవనం సాగించేవాడు. గత నెల 27న పని నిమిత్తం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆయన తిరిగి వచ్చి అదేరోజు రాత్రి మృతిచెందాడు. సాధారణ మరణంగా భావించిన కుటుంబ సభ్యులు స్వగ్రామానికి తీసుకొని మృతదేహాన్ని పూడ్చారు. తండ్రి మృతిపై అనుమానం ఉందని గత నెల 30న కుమార్తె సౌమిక మీర్‌పేట స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో మంగళవారం అక్కడి పోలీసులు గ్రామస్తుల సమక్షంలో వైద్యురాలు ఝాన్సీ ఆధ్వర్యంతో మృతదేహాన్ని వెలికితీసి అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. విచారణ దశలో ఉన్నందున వివరాలు త్వరలో ప్రకటిస్తామని ఆమె తెలిపారు.

## మైనర్‌పై అత్యాచారం కేసులో నిందితుడికి జీవితఖైదు

మహబూబ్‌నగర్ క్రైం: మైనర్ అత్యాచారం కేసులో నిందితుడికి జీవిత ఖైదు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళితే.. మహబూబ్‌నగర్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 2017లో కర్నూలుకు చెందిన విజయానంద్ పట్టణంలో ఓ ప్రైవేట్ పాఠశాలలో ఫిజిక్స్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. అదే పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని భయపెట్టి లోబర్చుకుని పలుమార్లు అత్యాచారం చేశాడు. సదరు బాలిక కొన్నిరోజులకు తల్లికి విషయం చెప్పడంతో 2017 ఆగస్టు 1న ఆ బాలిక తండ్రి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు చార్జ్‌షీట్ నమోదు చేసి, కోర్టుకు సమర్పించారు. మంగళవారం ఈ కేసు ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్(పోక్సో) కోర్టుకు రాగా.. న్యాయమూర్తి శ్రీదేవి పలు సాక్ష్యులను విచారించగా, నేరం రుజువు కావడంతో నిందితుడు విజయానంద్‌కు జీవిత ఖైదుతో పాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పీపీ పరందాములు, ఏపీపీ బాలస్వామి, పోలీసులను ఎస్పీ జానకి అభినందించారు.